సాక్షి అనకాపల్లి

మంగళవారం ၊ 28 ၊ మే ၊ 2024



అప్పన్న నిత్యకల్యాణం

సింహాచలేశునికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. వివాహ ఘట్టాలను కన్నులపండువగా నిర్వహించారు. 8లో



ఘన సత్కారం

విశాఖ: అభినవ సాబల బిరుదు పొందిన రంగస్థల నటుడు రొంగలి రాములును అమరావతి విశ్వసాహితి సభ్యులు ఘనంగా సత్కరించారు.

గరిష్ఠం/కనిష్ఠం
37.0/28.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉండి, గరిష్ట ఉష్ణోగ్రతలు 2–4 డిగ్రీలు పెరిగే అవకాశముందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి సోమవారం తెలిపారు.

న్యూస్‌రీల్

ఈఎన్‌టీ ఆస్పత్రికి ఎండోస్కోపీ ఉపకరణాల బహూకరణ



పరికరాలను స్వీకరిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ హరికృష్ణ

ఏయూక్యాంపస్: ప్రభుత్వ చెవి ముక్కు గొంతు(ఈఎన్‌టీ) ఆస్పత్రికి రెండు ఎండోస్కోపీ పరికరాలను మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ మురళీకృష్ణ అందించారు. కేజీహెచ్‌లో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఈఎన్‌టీ ఆస్పత్రిలో రోగులను పరీక్షించడానికి ఉపకరించే రూ.1.50 లక్షల విలువైన ఈ పరికరాలను ఆస్పత్రి సూపరింటెండెంట్ హరికృష్ణ స్వీకరించారు. వీటి సహాయంతో ఓపీలో నేరుగా రోగులను పరీక్షించడం సాధ్యపడుతుందని సూపరింటెండెంట్ తెలిపారు.

మైనర్ బాలికను వేధించిన యువకుడు

- పోక్సో కేసు నమోదు

నర్సీపట్నం: మైనర్ బాలికను వేధించిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశామని టౌన్ సీఐ కాంతికుమార్ తెలిపారు. బీసీ కాలనీకి చెందిన మైనర్ బాలిక పట్టణంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతోంది. బొంతు వీధికి చెందిన కదిరి అప్పారావు (28) ఆమెను కొంతకాలంగా వేధిస్తున్నాడు. అతని వేధింపులు మితిమీరడంతో బాలిక తల్లిదండ్రుల దృష్టికి తీసుకువెళ్లింది. దీంతో అప్రమత్తమై పట్టణ పోలీసులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు వేధింపునకు పాల్పడుతున్న అప్పారావుపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

స్టీల్ టౌన్‌షిప్‌లో విద్యుత్ చార్జీల పెంపు వాయిదా

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో విద్యుత్ చార్జీల పెంపును యాజమాన్యం మూడు నెలలు వాయిదా వేసింది. ఈ మేరకు సీఎండీ అతుల్ భట్ కార్మిక సంఘాలకు హామీ ఇచ్చారు. టౌన్‌షిప్ క్వార్టర్ల విద్యుత్ చార్జీలు యూనిట్ ధర 50 పైసలు నుంచి రూ.8కు పెంచుతూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసి అమలు కూడా ప్రారంభించింది. ఈ అంశంపై ఉక్కు కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశాయి. చార్జీల పెంపు అంశంపై సోమవారం ఉక్కు పరిపాలన భవనంలో కార్మిక సంఘాల నాయకులు సీఎండీ అతుల్ భట్‌ను కలిసి తమ వాదనను వినిపించారు. త్రైపాక్షిక ఒప్పందం మేరకు కార్మికులకు 50 పైసలు రేటు అమలు జరుగుతోందన్నారు. అయితే యాజమాన్యం ఏకపక్షంగా రూ.8కు పెంచడం అన్యాయమన్నారు. ఈ అంశంపై ఇప్పటికే కేంద్ర రీజినల్ లేబర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన విషయాన్ని వారు సీఎండీకి తెలిపారు. దీనిపై స్పందించిన సీఎండీ మూడు నెలలు పాటు చార్జీల పెంపు నిలిపి వేస్తామని, లేబర్ కమిషనర్ నిర్ణయం మేరకు ముందుకు వెళ్తామని హామీ ఇచ్చారు. ఈ నెల కటింగ్‌ను కూడా నిలిపి వేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. పదవీ విరమణ చేసిన కార్మికులకు వారు నిర్ణయించిన రేట్లకు క్వార్టర్ల ఎలాట్‌మెంట్ చేయాలన్న కార్మిక సంఘాల విజ్ఞప్తిని ఆయన అంగీకరించినట్టు నాయకులు తెలిపారు. సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు డి.ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, నీరుకొండ రామచంద్రరావు, వై.టి.దాస్, యు.రామస్వామి, దొమ్మేటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ గేమ్స్‌లో అన్సర్ వలికి బంగారు పతకం



బంగారు పతకం అందుకుంటున్న అన్సర్ వలి

మల్కాపురం (విశాఖ): ఈ నెల 25, 26 తేదీల్లో జమ్మూ కశ్మీర్ జమ్మూ యూనివర్సిటీలో సంయుక్త భారతీయ ఖేల్ ఫెడరేషన్(ఎస్‌బీకేఎఫ్) ఆధ్వర్యంలో నేషనల్ గేమ్స్ జరిగాయి. ఈ పోటీల్లో శ్రీహరిపురం సబ్‌స్టేషన్‌లో అసిస్టెంట్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్న అన్సర్ వలి పాల్గొని బంగారు పతకం సాధించారు. 35 ప్లస్ కేటగిరీలో జరిగిన పవర్‌లిఫ్టింగ్, 5 వేల మీటర్ల పరుగు పందెం, షాట్‌పుట్, డిస్కస్ త్రో లో అన్సర్ వలి అద్భుత ప్రతిభ చూపి ప్రథమ స్థానంలో నిలిచారు. దీంతో ఆయనను గోల్డ్ మెడల్ వరించింది. జమ్మూ ఆర్మీ సుబేదార్ మేజర్ ఎండీ యూసఫ్, ఎస్‌బీకేఎఫ్ ఫౌండర్ పంకజ్ గౌలే చేతుల మీదుగా వలి బంగారు పతకం అందుకున్నారు. శ్రీహరిపురం సబ్ స్టేషన్ ఏఈ, ఇతర సిబ్బంది ఫోన్‌లో అన్సర్ వలిని అభినందించారు.

పుస్తకాలు వచ్చేశాయ్..

- బడి తెరిచిన రోజే పంపిణీకి సిద్ధం
- 8, 9, 10 తరగతుల వారికి నేరుగా పాఠశాలలకే..
- మిగిలిన వారికి మండల పాయింట్లకు సరఫరా
- సెమిస్టర్–1కు అవసరమైన 4,61,502 పుస్తకాలు రెడీ



స్టాక్ పాయింట్‌కు చేరిన పుస్తకాలు
(ఇన్‌సెట్) పాఠ్య పుస్తకాలు సిద్ధం

సాక్షి, అనకాపల్లి: ఉపాధ్యాయుడు బోధించాలన్నా.. విద్యార్థి పాఠం నేర్చుకోవాలన్నా పాఠ్య పుస్తకాలు తప్పనిసరి. పాఠశాలలు పునఃప్రారంభమైన రోజు నుంచే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందుబాటులో ఉంచడంతో నాణ్యమైన విద్య అందుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎన్నికల వేళ కూడా విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా అన్ని చర్యలు చేపట్టింది. ఏటా మాదిరిగానే పాఠశాలలు తెరిచిన రోజునే జూన్ 12న పుస్తకాల పంపిణీకి ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ మేరకు పుస్తకాలు పాఠశాలలకు చేరుకుంటున్నాయి. పుస్తకాల పంపిణీని మరింత సరళతరం చేస్తూ 8, 9, 10 తరగతుల వారికి నేరుగా పాఠశాలలకు, మిగిలిన తరగతుల పుస్తకాలు మండల పాయింట్లకు చేరుతున్నాయి. ఇప్పటికి నాలుగేళ్ల పాటు విద్యా కానుకను విద్యార్థులు అందుకున్నారు. పేద బిడ్డల చదువులకు ఆటంకం కలగకూడదనే ఉన్నతాశయంతో ముందుగానే నిధులు కేటాయించడంతో వరుసగా ఐదో ఏడాది కూడా కానుక అందుకోనున్నారు.

జూన్ 12నే అన్ని పాఠశాలకు పుస్తకాలు

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాల పంపిణీ ప్రక్రియకు విద్యాశాఖ అధికారులు శ్రీకారం చుట్టారు. గాజువాకలో గల బుక్ డిపో నుంచి అనకాపల్లి జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు అధికారులు పుస్తకాల పంపిణీని ప్రారంభించారు. జిల్లాలో 24 మండలాల్లో ఏర్పాటు చేసిన విద్యా కానుక పాయింట్లకు పుస్తకాలను తరలించారు. జిల్లాలో మొత్తం 6,60,075 పుస్తకాల అవసరం ఉంది. సెమిస్టర్–1లో 4,61,502 పుస్తకాలు, సెమిస్టర్–2లో 1,98,573 పుస్తకాలు కావాలి. సెమిస్టర్–1లో 2,13,254 పుస్తకాలు (1,68,712 టెక్ట్స్ పుస్తకాలు, 44,542 వర్కు పుస్తకాలు) పంపిణీ చేశారు. గతేడాది 2 లక్షల వరకు పాఠ్య పుస్తకాలు మిగిలాయి. వాటితో కలిపి సెమిస్టర్–1లో పూర్తి స్థాయిలో అందజేస్తారు. గత నాలుగేళ్లుగా వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరిచిన రోజునే జగనన్న విద్యాకానుక ద్వారా విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, యూనిఫాం. టై, బెల్టు. షూ, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ తదితర సామగ్రి అందజేస్తూ వచ్చారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా ఏటా మాదిరిగానే ఈ ఏడాది పాఠశాలలు తెరిచే జూన్ 12వ తేదీన పుస్తకాల పంపిణీకి రంగం సిద్ధం చేశారు.

పదిలో సెమిస్టర్ విధానం

విద్యార్థుల వెన్నెముకపై భారం పడకుండా సెమిస్టర్ విధానాన్ని అమలు చేస్తున్నారు. గత విద్యా సంవత్సరంలో 1 నుంచి 9వ తరగతి వరకు ఈ విధానాన్ని అమలుచేయగా ఈ విద్యాసంవత్సరం నుంచి 10వ తరగతికి కూడా విస్తరించారు. గణితం, సైన్స్ సబ్జెక్టులను రెండు సెమిస్టర్లుగా విడదీశారు. సిలబస్‌ను జూన్ నుంచి అక్టోబరు వరకు సెమిస్టర్–1గా, నవంబరు నుంచి మార్చి వరకు సెమిస్టర్–2గా విభజించారు. 1 నుంచి 10వ తరగతి వరకు బైలింగ్యువల్ అమలు చేస్తున్నారు. ఈ విధానంలో పాఠ్యాంశాన్ని ఒక పేజీలో తెలుగు, ఒక పేజీలో ఇంగ్లిషులో ఇవ్వడం వలన విద్యార్థులకు సులభంగా అర్థమవుతుంది. విద్యార్థు లను ఆకట్టుకునేలా పాఠ్యపుస్తకం కవర్ పేజీలను తీర్చిదిద్దారు. పుస్తకాలపై క్యూఆర్ కోడ్ కూడా ముద్రించారు. పాఠ్యాంశానికి సంబంధించి అదనపు సమాచారం పొందేందుకు ఈ క్యూఆర్ కోడ్ ఉపయోగపడుతుంది.

బడి తెరిచే నాటికి అందరికీ పాఠ్యపుస్తకాలు



జిల్లాలో 24 మండలాల ఎంఈవో కార్యాలయాలకు సోమవారం సాయంత్రానికి పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలు పంపించాం. గత ఏడాది వచ్చిన పుస్తకాల్లో రెండు లక్షల మిగిలాయి. నాలుగో తరగతి మినహా అన్ని తరగతులకు పాఠ్యపుస్తకాలను సరఫరా చేస్తున్నారు. నాలుగో తరగతికి సంబంధించిన పుస్తకాలు ఈ నెలాఖరు నాటికి వస్తాయి. బడి తెరిచేనాటికి అన్ని పాఠశాలల్లో సరిపడా పాఠ్య పుస్తకాలు ఉండేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఏ ఒక్క విద్యార్థి పాఠ్య పుస్తకాలు లేకుండా ఉండకూడదు.

– శ్రీనివాస్, పాఠ్య పుస్తక డిపో మేనేజర్

జిల్లాలో 327 మంది దివ్యాంగ బాలల గుర్తింపు

- మరుపాకలో సర్వేను పరిశీలించిన జిల్లా సహిత విద్య సమన్వయకర్త శకుంతల



దివ్యాంగ విద్యార్థితో మాట్లాడుతున్న జిల్లా సహిత విద్య సమన్వయకర్త శకుంతల

రావికమతం: జిల్లాలో ఇప్పటి వరకు 327 మంది దివ్యాంగ పిల్లలను గుర్తించామని జిల్లా సహిత విద్య సమన్వయకర్త బి. శకుంతల తెలిపారు. ఏటా మే 1 నుంచి జూన్ 9వ తేదీ వరకూ దివ్యాంగ పిల్లల గుర్తింపునకు సర్వే నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా మరుపాకలో సర్వేను సోమవారం ఆమె పరిశీలించారు. గ్రామాల్లో ఐఈఆర్టీ ఉపాధ్యాయులు సర్వే చేస్తున్నారన్నారు. రావికమతం మండలంలో సర్వే బాగుందని కితాబిచ్చారు. ఇక్కడ గుర్తించిన 14 మందిని స్థానిక భవిత కేంద్రంలో చేర్పించి విద్యతోపాటు ప్రత్యేక శిక్షణ, ఫిజియోథెరపీ అందిస్తారన్నారు. ప్రభుత్వం అలవెన్స్ సైతం ఇవ్వనుందన్నారు. ప్రాథమిక స్థాయిలోనే ప్రత్యేక ఉపాధ్యాయుల ద్వారా ఆటపాటలతో బోధన, ఫిజియోథెరపీ అందించడం వల్ల వారి జీవన విధానంలో గణనీయమైన మార్పులు వస్తున్నాయని తెలిపారు. ఇందుకోసం గతేడాది జిల్లాలో 1,485 మంది దివ్యాంగ పిల్లలకు రూ.37,86,000 మంజూరు చేసిందన్నారు. ఎంఈవో తలుపులు, మండల ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మినాయుడు, జగన్నాథనాయుడు పాల్గొన్నారు.

పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం



రేబాకలో విద్యార్థుల ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న కోఆర్డినేటర్ శ్రీనివాసరావు



నర్సీపట్నంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

తుమ్మపాల, నర్సీపట్నం: పాలిసెట్–2024 కౌన్సెలింగ్ ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. అనకాపల్లి మండలం రేబాక, నర్సీపట్నంలలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో తొలిరోజు 1 నుంచి 12 వేల ర్యాంక్ వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రేబాకలో 56 మంది బాలురు, 43 మంది బాలికలు మొత్తం 99 మంది కౌన్సెలింగ్‌కు హాజరైనట్టు పాలిసెట్ కోఆర్డినేటర్, కాలేజీ ప్రిన్సిపల్ ఐవీఎస్ఎస్ శ్రీనివాసరావు తెలిపారు. వారి ధ్రువపత్రాలు పరిశీలించి ఐసీఆర్ పత్రాలు అందించామన్నారు. నర్సీపట్నంలో 58 మంది విద్యార్థినీ విద్యార్థుల సర్టిఫికెట్లు పరిశీలించామని స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రరావు తెలిపారు. మంగళవారం 12,001 నుంచి 27,000వ ర్యాంక్ వరకు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. జూన్ 3వ తేదీ వరకు నిర్వహించే కౌన్సెలింగ్‌లో విద్యార్థులు సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. అనంతరం దగ్గరలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లి ఉచితంగా ఆప్షన్లు ఎంచుకోవచ్చన్నారు. ఈ నెల 31వ తేదీ నుంచి ఆప్షన్ల ఎంపికకు అవకాశం కల్పించారన్నారు. వచ్చేనెల 3న సర్టిఫికెట్ల పరిశీలన పూర్తవుతుందన్నారు.

జూలో కొత్త హంగులు



పక్షుల జోన్‌లలో అద్దాలతో ఆధునికీకరించిన బర్డ్స్ ఎన్‌క్లోజర్లు

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో కొత్తదనం సంతరించుకుంటోంది. ఇతర ప్రాంతాల జూ పార్కుల నుంచి తీసుకొచ్చిన కొత్త వన్యప్రాణులతో పాటు కొత్త నిర్మాణాలతో కళకళలాడుతోంది. జూలో అధికారులు ఇటీవల అవసరమైన పలు భవన నిర్మాణాలు చేపట్టారు. వాటిలో కొన్ని నిర్మాణాలు పూర్తికాగా మరికొన్ని తుది దశలో ఉన్నాయి. ఇంకొన్ని పనులు ప్రారంభించాల్సి ఉంది. వన్యప్రాణులకు అవసరమైన ఎన్‌క్లోజర్ల నిర్మాణంతో పాటు సందర్శకుల కోసం ప్రత్యేక వసతులు కల్పిస్తున్నారు. జూలో రెండేళ్లలో సుమారు రూ.4 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఐవోసీఎల్ సీఎస్ఆర్ నిధులను రూ. 2 కోట్లు అందించింది. ఆ నిధులతో జూ పార్కులో బయోస్కోప్ ఆధునికీకరణ, హిమాలియన్ బేర్ నైట్‌క్రాల్, హైనా మోటో, పాముల జోన్ వద్ద మరుగుదొడ్లు, ఖడ్గమృగం నైట్‌క్రాల్ నిర్మాణాలు చేపట్టారు. వీటిలో బయోస్కోప్ భవనం నిర్మాణంలో ఉంది. మరో రూ.2 కోట్ల జూ నిధులతో మీర్‌క్యాట్ ఎన్‌క్లోజర్, రెండు స్లాత్ బేర్ ఎన్‌క్లోజర్లు, బార్కింగ్ డీర్ నైట్‌క్రాల్, డేక్రాల్ ఎన్‌క్లోజర్, సావనీర్ షాపు, రెండు చోట్ల చిన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. ఎన్‌క్లోజర్ల వద్ద సందర్శకుల సౌలభ్యం కోసం ఫుట్‌పాత్‌లు నిర్మించారు. వీటితో పాటు జూలో డీర్ సఫారీని పునః ప్రారంభించడానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందు కోసం రిలయన్స్ సంస్థ సీఎస్ఆర్ నిధులు రూ.2 కోట్లు ఇవ్వడానికి ముందుకొచ్చింది. ఆ నిధులతో డీర్ సఫారీ, హుద్‌హుద్ సమయంలో కూలిపోయిన రాబందుల ఎన్‌క్లోజర్‌ను అభివృద్ధి చేయనున్నారు.

ఓట్ల లెక్కింపునకు అంతా సహకరించాలి

- నాయకులు, ప్రజలు సంయమనం పాటించాలి
- పోలింగలాగే కౌంటింగ్‌ను ప్రశాంతంగా ముగించాలి: ఎస్పీ మురళీకృష్ణ



మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు జానకీరామరాజు

అనకాపల్లి: మండలంలో శంకరం పంచాయతీ ఫ్యూచర్ వరల్డ్ స్కూల్ ఆవరణలో వచ్చేనెల 4న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉంటుందని, ఆ రోజు అన్ని రాజకీయ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సంయమనంతో వ్యవహరించాలని ఎస్పీ కేవీ మురళీకృష్ణ తెలిపారు. సోమవారం స్థానిక రింగ్‌రోడ్డు పెంటకోట కన్వెన్షన్ హాల్లో 'శాంతి భద్రతల పరిరక్షణ అనే అంశంపై అవగాహన సదస్సు' జరిగింది. ఈ సదస్సులో పాల్గొన్న నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీల నేతలనుద్దేశించి ఆయన మాట్లాడారు. వచ్చే నెల 1న ఎగ్జిట్ పోల్స్, 4వ తేదీన 6 అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహిస్తారన్నారు. జిల్లాలో ప్రశాంత పోలింగ్‌కు సహకారం అందించినట్టే ఎగ్జిట్ పోల్స్, ఎన్నికల ఫలితాల రోజులలో సంయమనం పాటించాలని కోరారు.

కౌంటింగ్‌కు ముందుగానీ, తర్వాత గాని కౌంటింగ్ రోజు గాని ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా గట్టి పోలీస్ భద్రత ఏర్పాటు చేస్తున్నామన్నారు. కౌంటింగ్ రోజు 144 సెక్షన్, 30 పోలీస్ యాక్టు అమలులో ఉంటుందని స్పష్టం చేశారు. కౌంటింగ్ కేంద్రంలోకి ఎటువంటి మొబైల్ ఫోన్లుగానీ, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్‌గానీ, పెన్, పేపర్ మొదలగు వాటిని ఎన్నికల నిబంధనలు ప్రకారం అనుమతించడం లేదన్నారు. కౌంటింగ్ ముగిసిన తర్వాత ఎటువంటి ఊరేగింపులు, ర్యాలీలు చేయకూడదని, మందుగుండు సామగ్రిని కాల్చకూడదని, గుంపులుగా ఉండకూడదని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. ప్రజలందరూ సంయమనంతో వ్యవహరిస్తూ, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖకు సహకరించాలన్నారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికల్లో ఎటువంటి ఘర్షణలకు పాల్పడవద్దని, గ్రామీణ స్థాయి నుంచి అన్ని పార్టీ నాయకులు కుటుంబ సమేతంగా కలిసిమెలిసి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఎస్. అప్పలరాజు, సీఐలు జి.శంకరరావు, ధనుంజయరావు, వినోద్‌బాబు, ఎస్ఐలు సత్యనారాయణ, అలీ షరీఫ్, తేజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి ప్రశాంతమయిన ప్రాంతం: మందపాటి జానకీరామరాజు

అనకాపల్లి నియోజకవర్గంలో అన్ని రాజకీయ పార్టీ నేతలు కుటుంబ సభ్యులుగా కలిసిమెలిసి ఉంటారని, ఎన్నికల సమయంలో వారి వారి పార్టీ గెలుపు కోసం మాత్రమే కృషి చేస్తారని, ప్రజల తీర్పును శిరసావహిస్తారని వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు చెప్పారు. పోలీసుల సూచనలను తప్పనిసరిగా పాటిస్తామన్నారు. టీడీపీ నాయకుడు బీఎస్ఎంకే జోగినాయుడు మాట్లాడుతూ.. ఈ దఫా సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థులు వ్యక్తిగత విభేదాలకు పాల్పడకుండా ప్రశాంతమైన వాతావరణంలో వారి వారి గెలుపు కోసం ప్రచారాలు చేపట్టారన్నారు. పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని, రానున్న రోజుల్లో ఇదే మాదిరిగా ఉంటామన్నారు.

మత్స్యకారులకు 'భరోసా'

- వేట నిషేధ కాలంలో రూ.10 వేల సహాయం
- జిల్లాలో 11 వేల మంది లబ్ధిదారులు
- ఎన్నికల కోడ్‌తో ఆలస్యమైన పరిహారం పంపిణీ
- కొత్త ప్రభుత్వంలో చెల్లింపులు
- ఏప్రిల్ 14 అర్ధరాత్రి నుంచి జూన్ 14 అర్ధరాత్రి వరకూ వేట నిషేధం
- ఆలోగా ఇస్తే తమకు సాయంగా ఉంటుందంటున్న మత్స్యకారులు



వేట నిషేధం కావడంతో పూడిమడకలో ఒడ్డుకే పరిమితం అయిన బోట్లు

అచ్యుతాపురం:

వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. నాలుగేళ్ల నుంచి వరుసగా ఒక్కో మత్స్యకార కుటుంబానికి 10 వేల రూపాయల చొప్పున మత్స్యకార భరోసా అందజేసేది. ఈ ఏడాది కూడా వేట నిషేధం సమయంలో ఎన్నికలు రావడంతో లబ్ధిదారులను ఎంపిక చేసినప్పటికీ వారికి పరిహారం అందించేందుకు సాంకేతిక అవరోధాలు ఏర్పడ్డాయి. ఈ ఏడాది ఏప్రిల్ 14 అర్ధరాత్రి నుంచి జూన్ 14 అర్ధరాత్రి వరకూ వేట నిషేధం కారణంగా మత్స్యకారులు ఇళ్ల వద్దే ఉంటూ వలలకు, బోట్లకు మరమ్మతులు చేసుకుంటారు. జిల్లాలో ఈ ఏడాది సుమారు 11వేల మంది అర్హులను ఎంపిక చేశారు. 61 రోజుల తర్వాత సముద్రంలోకి అడుగుపెట్టే మత్స్యకారులకు ఈ ఎన్నికల సమయంలో పరిహారం అందకపోవడంతో దిగాలుగా ఉన్నారు. ఎన్నికల కోడ్‌తో సంబంధం లేకుండా తమకు పరిహారం ఇవ్వాలని వారు కోరుతున్నారు. సముద్రంలోని చేపల సంతానోత్పత్తికి విఘాతం కలగకుండా ఉండేందుకు ఎన్నో దశాబ్దాల నుంచి ఈ రెండు నెలల పాటు వేట నిషేధించడం ఆనవాయితీ. మత్స్యకారుల జీవనోపాధికి ఇబ్బందులు లేకుండా ఈ పరిహారం దోహదపడేది. అనకాపల్లి జిల్లా పరిధిలో 73 కిలోమీటర్ల సముద్ర తీరం ఉంది. తీరంలో ఉన్న ఆరు మండలాల పరిధిలోని 31 మత్స్య గ్రామాలు ఉన్నాయి. 11 వేల మత్స్య కుటుంబాలు కేవలం చేపల వేట, విక్రయంపైనే ఆధారపడి ఉంటున్నారు.

రెండు నెలల విరామం కారణంగా మత్స్యకార భరోసా...

అనకాపల్లి జిల్లా పరిధిలో సుమారు 11 వేల మందికి ఈ ఏడాది మత్స్యకార భరోసా అందించనున్నారు. ఒక్కో మత్స్యకార కుటుంబానికి పది వేల రూపాయలను నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేస్తారు. అనకాపల్లి జిల్లా పరిధిలోని మత్స్యకారులకు డీజిల్‌ను సబ్సిడీపై అందిస్తుంది. మత్స్యకారులకు ఆర్థికంగా మద్దతు ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 'ఆంధ్రా ఫిష్' వంటి కార్యక్రమాలను అమల్లోకి తీసుకొచ్చింది. తద్వారా చేపలకు మంచి డిమాండ్ కూడా పెరిగింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.4 వేలు మాత్రమే వేట నిషేధ భృతి అందజేశారు. అది కూడా నిషేధ కాలం ముగిశాక ఎప్పుడో అందేది. 2019వ సంవత్సరంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఆ భృతిని రూ.పది వేలకు పెంచి, నిషేధ సమయంలోనే అందించడంతో మత్స్యకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆకలితో అలమటించాల్సిన బాధ తప్పిందంటున్నారు. అయితే ఈ ఏడాది ఎన్నికల నిబంధనలు శరాఘాతంగా మారాయి. కోడ్ కారణంగా భృతి అందించడం ఆలస్యమవుతోంది.

కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చెల్లింపులు

ఈ ఏడాది 11 వేల మందికి మత్స్యకార భరోసాను అందించనున్నాం. గత ఏడాది అనకాపల్లి జిల్లాలో 11,116 మంది మత్స్యకార భరోసా వేట నిషేధ సమయంలోనే వారి ఖాతాల్లోకి జమ చేసింది. ఈ ఏడాది ఎన్నికల నిబంధనల కారణంగా కోడ్ అమల్లో ఉన్నందున జాబితా అయితే రూపొందించాం కానీ నిధుల జమ జరగలేదు. వేట నిషేధం ఏప్రిల్ నెలలో మొదలవ్వడంతో నిర్ణయాలన్నీ ఎన్నికల కమిషన్ చేతుల్లోకి వెళ్లిపోయాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిధులు విడుదల కానున్నాయి.

–ప్రసాదరావు, జిల్లా మత్స్యశాఖాధికారి

ఈస్ట్‌కోస్ట్ రైల్వే జీఎం పర్యటన



వడ్లపూడి వ్యాగన్ వర్క్‌షాప్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఈస్ట్‌కోస్ట్‌రైల్వే జీఎం బెహరా

తాటిచెట్లపాలెం (విశాఖ): ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ ఎం.కె.బెహరా సోమవారం వాల్తేర్ డివిజన్‌లో పర్యటించారు. డివిజన్ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను, పనితీరును పరిశీలించారు. వడ్లపూడిలోని వ్యాగన్ వర్క్‌షాప్‌ను సందర్శించి, అక్కడి సదుపాయాలు, నిర్వహణ కార్యకలాపాలు, అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం దొండపర్తిలోని డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో గల కాన్ఫరెన్స్ హాల్‌లో డివిజనల్ ఉన్నతాధికారులతో సమావేశమై పలు విషయాలు చర్చించారు.

ఈ పర్యటనలో జీఎంతో పాటు వాల్తేర్ డివిజన్ డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్కే సేనాపతి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందించారు.

'హంస' జిల్లా అధ్యక్షుడిగా మహేష్



హంస జిల్లా నూతన కమిటీ సమావేశంలో విశాఖ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చిన్నబాబు

అనకాపల్లి : హెల్త్ అడ్మిన్‌స్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (హంస) జిల్లా అధ్యక్షునిగా కె.మహేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయం ఆవరణలో సోమవారం జరిగిన ఎన్నికల్లో జిల్లా కార్యదర్శిగా ఎ.రామస్వామి, కోశాధికారిగా కె.నాగరాజుతో పాటు మరో 8 మంది అసోసియేషన్ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గం మూడు సంవత్సరాల పాటు మనుగడలో ఉంటుందని విశాఖ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డి.చిన్నబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఎన్.బాబి, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆంజనేయులు, విశాఖ సిటీ అధ్యక్షుడు కనకాల సత్యనారాయణ, సిటీ ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాస్, సిటీ సహాయ కార్యదర్శి బి.రాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

రాంబిల్లి: మండల కేంద్రం రాంబిల్లిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందింది. వివరాలు. పెదకలవలాపల్లికి చెందిన మడగల భూదేవి(59)ని మండల పరిషత్ కార్యాలయం ఎదుట అచ్యుతాపురం నుంచి రాంబిల్లి వైపు వస్తున్న క్రేన్ ఢీకొట్టింది. ప్రమాదంలో భూదేవి శరీరం నుజ్జునుజ్జయింది. ఈమె అవివాహిత. మేనల్లుడి వద్ద ఉంటోంది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ లక్ష్మణరావు తెలిపారు.

వైఎస్సార్ పశు బీమా.. పాడి రైతుకు ధీమా



జిల్లేడుపూడిలో ఇంజక్షన్‌తో జన్మించిన పెయ్యను పరిశీలిస్తున్న విశాఖ డెయిరీ డైరెక్టర్ సూర్యనారాయణ, మేనేజర్ సత్యనారాయణ, సిబ్బంది



శంఖవరంలో రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తున్న అధికారులు



వ్యాక్సిన్ వేస్తున్న గోపాలమిత్ర

- ఉమ్మడి జిల్లాకు వైఎస్సార్ పశు బీమా నిధులు రూ.33 లక్షలు మంజూరు
- బీమా మొత్తంలో ప్రభుత్వ వాటా 80 శాతం, రైతు వాటా 20 శాతం
- రూ.3 లక్షలతో లేగ దూడల ప్రదర్శన ద్వారా రైతులకు ప్రోత్సాహకాలు
- సంకర జాతి పశువుల అభివృద్ధికి రాయితీపై ఇంజక్షన్లు
- పాడి అభివృద్ధిలో రైతులకు అన్ని విధాలా ప్రభుత్వ ప్రోత్సాహం

నాతవరం: పాడి రైతుల్ని ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సాయపడుతోంది. పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు అమలు చేస్తోంది. వైఎస్సార్ పశు బీమాతో పాడి రైతుల్లో ధీమా పెంచుతోంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో పశువులకు బీమా సదుపాయం కల్పించేందుకు ఇటీవల ప్రభుత్వం రూ.33 లక్షలు మంజూరు చేసింది. దీంతో పశువుల కేటగిరీ, విలువ ఆధారంగా ప్రభుత్వం బీమా నిధులు చెల్లిస్తోంది. బీమా మొత్తంలో కేవలం 20 శాతం రైతు చెల్లిస్తే చాలు. మిగిలిన 80 శాతాన్ని ప్రభుత్వమే భరిస్తోంది.

పాడి రైతులకు అవగాహన

పశు బీమాపై పాడి రైతుల్లో అవగాహన లేక గతంలో చాలా వరకు నష్టపోవాల్సి వచ్చేది. రోగాలు, ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాల బారిన పడి పశువులు మరణించినా, కనీస పరిహారం కూడా దక్కేది కాదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆ పరిస్థితికి చెక్ పడింది. జిల్లా వ్యాప్తంగా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించి, రైతుల్లో చైతన్యం తీసుకువస్తున్నారు. వైఎస్సార్ పశు బీమాకు సంబంధించి ఆర్బీకేల్లో పని చేసే సిబ్బంది ఎప్పటికప్పుడు రైతులకు క్షేత్రస్థాయిలో సమాచారం అందిస్తున్నారు. దీంతో పశు నష్టం పాడి రైతుల్లో కనీస స్థాయికి చేరుకుంది.

పెయ్యల ఉత్పత్తికి రాయితీపై ఇంజక్షన్లు

తక్కువ వ్యయంతో అధిక దిగుబడినిచ్చే సంకర జాతి పశువుల ద్వారా పాడి ఉత్పత్తుల్ని పెంచే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్ల ద్వారా పెయ్యలు మాత్రమే జన్మించేలా చేస్తోంది. రూ.1,350 విలువ చేసే ఇంజక్షన్‌ను రాయితీపై రూ.500లకే అందిస్తోంది. ఉమ్మడి విశాఖలో ఈ ఏడాది 4 వేల ఇంజక్షన్లు వేయాలన్న లక్ష్యంతో అధికారులు కృషి చేస్తున్నారు. గత ఏడాది ఇంజక్షన్లు ద్వారా జన్మించిన పెయ్యలు మండలానికి 25 నుంచి 30 వరకు ఉన్నాయి.

లేగదూడల ప్రదర్శనకు రూ.3 లక్షలు

ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో లేగదూడల ప్రదర్శనల కోసం ప్రభుత్వం రూ.3 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో 30కి పైగా లేగదూడల ప్రదర్శనలు నిర్వహించారు. లేగ దూడల్ని ఆరోగ్యవంతంగా పెంచే రైతులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నారు. దీంతోపాటు లేగదూడలకు ఉచితంగా మందులు, ఇంజక్షన్లు సరఫరా చేసి, వారిని మరింత ప్రోత్సహిస్తున్నారు. పశువులు, గొర్రెలు, మేకల్లో వచ్చే సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ముందస్తుగా వ్యాక్సిన్లు వేస్తున్నారు. ఈ కార్యక్రమాలను పశుగణాభివృద్ధి సంస్థలో పని చేస్తున్న 156 మంది గోపాలమిత్రలతో పాటు, పశు సంవర్ధకశాఖ అధికారులు సంయుక్తంగా నిర్వహిస్తున్నారు.

రైతుల ఆసక్తి



ప్రభుత్వం రైతులకు రాయితీపై అందిస్తున్న కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లతో పాడి రైతులకు ఎంతగానో మేలు జరుగుతోంది. తక్కువ ధరకే ఇంజక్షన్లు అందించడంతో రైతులు పెయ్యల ఉత్పత్తిపైనే దృష్టి సారిస్తున్నారు. జిల్లాలో అధికంగా మా ప్రాంతంలోనే ఆడపెయ్యలు జన్మించాయి. అధిక పాల ఉత్పత్తితో పాటు ఆడపెయ్యలతో పాడి రైతుకు మరింత ఆదాయం సమకూరుతుంది. మండలంలోని జిల్లేడుపూడి, వెంకయ్యపాలెంలో జన్మించిన పెయ్యలను చూసేందుకు పరిసర ప్రాంతాల వారు ఎక్కువగా వస్తున్నారు.

– కిల్లాడ వెంకటరమణ, రాష్ట్ర అధ్యక్షుడు, గోపాలమిత్ర సంఘం

సద్వినియోగం చేసుకోవాలి



పాడి రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు ఉపయోగించుకోవాలి, పాడి పశువు ఆకాల మరణం పొందితే వైఎస్సార్ పశు బీమా పథకంలో రైతుకు ఆర్థిక సాయం అందిస్తాం. పశువు విలువను బట్టి ఈ బీమా మొత్తం ఉంటుంది. రైతు వాటా 20 శాతం మాత్రమే. పెయ్యల ఉత్పత్తికి అందించే రాయితీ ఇంజక్షన్లు రైతులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. లేగ దూడలను ఏపుగా పెంచేందుకూ ప్రోత్సాహకాలు అందిస్తున్నాం, ఆర్బీకేల్లో ఉండే సిబ్బంది, గోపాలమిత్రల ద్వారా పాడి రైతులకు అవసరమైన సేవలు అందిస్తున్నాం.

–బి.రామ్మోహన్‌రావు, ఉప సంచాలకుడు, ఉమ్మడి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



బద్ద చినఅప్పారావు(ఫైల్)



రెడ్డి అప్పారావు (ఫైల్)

నక్కపల్లి: మండలంలో నక్కపల్లి, న్యాయంపూడి గ్రామాల్లో సోమవారం జరిగిన రెండు ప్రమాదాల్లో ఇద్దరు మరణించారు. సీఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాలు. నక్కపల్లి ఎస్సీ కాలనీ చెందిన బద్ద చిన అప్పారావు(36) ఈ నెల 25న కూలి పని కోసం ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రి అయినా ఎంతకీ తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఇతని కోసం పరిసర గ్రామాలు, తెలిసిన వారిళ్లకు వెళ్లి ఆరా తీశారు.

సోమవారం ఉదయం చెరువులో శవం తేలి ఉండడంతో అది చినఅప్పారావేనని గుర్తించారు. పోలీసులకు సమాచారం అందడంతో నక్కపల్లి, ఎస్.రాయవరం సీఐలతో పాటు క్లూస్ టీమ్ మృతదేహాన్ని పరిశీలించారు. ప్రమాదవశాత్తూ చెరువులో మునిగి చనిపోయి ఉండవచ్చని కుటుంబ సభ్యులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు సీఐ కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నక్కపల్లి ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో..

న్యాయంపూడికి చెందిన రెడ్డి అప్పారావు(59) సోమవారం ఉదయం ఉపాధి పనికి సైకిల్‌పై న్యాయంపూడి నుంచి వెదుళ్లపాలెం వైపు వెళ్తున్నాడు. ఇదే మార్గంలో వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొని, తలపై నుంచి వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మరణించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

హుర్రే.. జాబ్ సాధించానోచ్!



కశింకోట: ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో అధ్యాపక బృందం



మాకవరపాలెం: ఉద్యోగాలు పొందిన వారితో ముఖ్య అతిథులు, అధ్యాపకులు

- 85 మంది విద్యార్థులకు జాబ్ ఆఫర్ లెటర్లు

కశింకోట: చదువుకుంటున్న సమయంలోనే భారీ ప్యాకేజీతో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. తమ తల్లిదండ్రుల సమక్షంలోనే జాబ్ ఆఫర్ లెటర్లు స్వీకరించి హుర్రే అంటూ సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం పాదాభివందనం చేసిన శిష్యులను చూసి గురువులు ఉద్వేగానికి లోనవగా.. ఇటు తల్లిదండ్రులు ఆనంద బాష్పాలతో దీవించారు. ఈ అపురూప దృశ్యం స్థానిక ఏపీఈపీడీసీఎల్ డివిజన్ (పూర్వ ఆర్ఈసీఎస్) కార్యాలయంలోని రాజీవ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం ఆవిష్కృతమైంది. ఈ విద్యా సంవత్సరం క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో కళాశాలకు చెందిన 116 మంది విద్యార్థులు అర్హత సాధించగా, వారిలో 85 మంది అత్యధిక ప్యాకేజీతో వివిధ పరిశ్రమల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో స్థానిక కళాశాలలో ప్రిన్సిపాల్ శివ పర్యవేక్షణలో ఉద్యోగ సాధకుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశ్రమల్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు జాబ్ ఆఫర్ లెటర్లను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గణేష్, టీపీవో డి.జనార్దన్, విభాగాధిపతులు పి.రమణకుమార్, బి.జగన్మోహిని, ఎం.జగదీష్, వై.వీరేంద్ర పాల్గొన్నారు.

నిరంతర కృషితో లక్ష్య సాధన

మాకవరపాలెం: నిరంతర కృషితో లక్ష్యాలను సాధించొచ్చని సూర్య వర్ధన్ ఇంటిగ్రేషన్ ఎండీ శేషుకుమార్, పైనీర్ అల్యూమినియం ఇండస్ట్రీ అసిస్టెంట్ మేనేజర్ ఆర్‌ఏ నాయుడు తెలిపారు. సోమవారం అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందిన పాలిటెక్నికల్ విద్యార్థులతో జాబ్ అచీవర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల విజయాన్ని కోరుకుంటారని, వాటిని నిజం చేయడంలో విద్యార్థులు పట్టుదలతో ముందుకు సాగాలన్నారు. అనంతరం ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాదరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పోర్టును సందర్శించిన తూర్పు కోస్తా రైల్వే జీఎం

విశాఖ సిటీ: విశాఖ పోర్ట్ అథారిటీ, విశాఖ కంటైనర్ టెర్మినల్ ప్రై.లి. పరిధిలోని వివిధ రైల్వే ప్రాజెక్టుల పురోగతిని పరిశీలించేందుకు వాల్తేర్ డివిజన్ డీఆర్‌ఎం సౌరబ్ ప్రసాద్‌తో కలిసి ఈస్ట్ కోస్ట్ రైల్వే జీఎం(ఇన్‌చార్జి) ఎం.కె.బెహ్రా సోమవారం విశాఖ పోర్టును సందర్శించారు. ఈ సందర్భంగా పోర్టు పరిధిలో జరుగుతున్న రైల్వే సంబంధిత అంశాలను పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ దుబే వివరించారు. సరకు రవాణాను మరింత పెంపొందించేందుకు రేక్‌లను కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పోర్టు పరిధిలోని రైల్వే విద్యుదీకరణ అంశాలను సైతం విశదీకరించారు. దీనిపై బెహ్రా మాట్లాడుతూ రైల్వే సంబంధిత అభివృద్ధి పనులకు తమ పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



కార్డన్ సెర్చ్‌లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలు, (ఇన్‌సెట్) నాతవరంలో విలేకర్లతో మాట్లాడుతున్న నర్సీపట్నం డీఎస్పీ మోహన్, పక్కన సీఐలు, ఎస్ఐలు



బుచ్చెయ్యపేటలో సీజ్ చేసిన వాహనాల వద్ద సీఐ, ఎస్ఐ, సిబ్బంది

నాతవరం/బుచ్చెయ్యపేట: ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని నర్సీపట్నం డీఎస్పీ బీఆర్‌కే మోహన్ హెచ్చరించారు. నాతవరంలోని బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ, ఇందిరమ్మ మోడల్ కాలనీ, ప్రధాన కూడలి జంక్షన్‌లలో సోమవారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. రికార్డులు సరిగాలేని ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతరం డీఎస్పీ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, పలు అంశాలను తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సోమవారం డివిజన్ పరిధి ఎస్.రాయవరం, నాతవరం మండలాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించామన్నారు. నాతవరంలో 60, ఎస్.రాయవరంలో 70 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. రికార్డులు చూపించిన వారికి, వాహనాలు తిరిగిచ్చేస్తామన్నారు. గంజాయి రవాణాకు సహకరించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. గంజాయి రవాణా చేస్తూ తరచూ పట్టుబడుతున్న రౌడీ షీటర్లపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తామన్నారు. రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉందన్నారు. పోలీసుల అనుమతి లేకుండా విజయోత్సవ ర్యాలీలు, సమావేశాలు నిషిద్ధమన్నారు. సమావేశంలో నర్సీపట్నం రూరల్, టౌన్ సీఐలు హరి, క్రాంతికుమార్, నాతవరం, గొలుగొండ, కేడీ పేట, మాకవరపాలెం, నర్సీపట్నం ఎస్ఐలు రామారావు, కృష్ణారావు, ఉపేంద్ర, రామకృష్ణ, ఉమామహేశ్వరరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేటలో..

సరైన రికార్డుల్లేని 60 వాహనాలను సీజ్ చేసినట్లు కొత్తకోట సీఐ ఎల్.అప్పలనాయుడు తెలిపారు. సోమవారం బుచ్చెయ్యపేట, రావికమతం, కొత్తకోట, రోలుగుంట ఎస్ఐలు డి.ఈశ్వరరావు, ధనుంజయ నాయుడు, లక్ష్మణరావు, సురేష్‌లు తమ సిబ్బందితో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. రికార్డులు సరిగాలేని 58 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలను సీజ్ చేశారు. జూన్ 4 వరకు 144 సెక్షన్ అమల్లో ఉన్నందున గుంపులుగా ఎవరూ తిరగవద్దని హెచ్చరించారు.

ఎన్‌బీఏ గుర్తింపు సాధనలో

మనమే నంబర్ 1

- తర్వాత స్థానాల్లో మహారాష్ట్ర, తెలంగాణ
- రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నాగరాణి



విలేకరులతో మాట్లాడుతున్న రాష్ట్ర టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ నాగరాణి

మురళీనగర్(విశాఖ): నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్(ఎన్‌బీఏ) సాధించడం అందని ద్రాక్షలాంటిదని భావించే వారికి ఆంధ్రప్రదేశ్ సాధించిన ప్రగతి ఆదర్శంగా నిలుస్తుంది. పాలిటెక్నిక్ కాలేజీల్లో నిర్వహించే కోర్సులన్నింటికీ ఎన్‌బీఏ సాధించడం ఒక వరంలా భావిస్తారు. ఇప్పటి వరకు అదొక బ్రహ్మ పదార్థంగా భావించిన వారికి మన పాలిటెక్నిక్‌లు ఎన్‌బీఏ గుర్తింపు సాధించి దేశంలోనే మొదటి స్థానంలో నిలవడం చారిత్రాత్మకంగా నిలుస్తుంది. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్‌గా సి.నాగరాణి బాధ్యతలు చేపట్టిన తర్వాత సాంకేతిక విద్యా వ్యవస్థలో ప్రక్షాళన జరిగి అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయి. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను సోమవారం ఆమె సందర్శించారు. జాబ్ అచీవ్‌మెంట్ డే కార్యక్రమంలో పాల్గొని.. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే.

ప్రతిష్టాత్మకంగా ఎన్‌బీఏ గుర్తింపు

జాతీయస్థాయిలో మన రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కాలేజీలకు గుర్తింపు సాధించాలని ప్రథమ లక్ష్యంగా పెట్టుకున్నాం. నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్(ఎన్‌బీఏ) గుర్తింపు రావడం మకుటాయమానంగా నిలుస్తుంది. దీని వల్ల మన విద్యార్థులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విలువ పెరిగి అత్యుత్తమ ఉపాధి అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయి. అందుకే ప్రభుత్వ కాలేజీలు ఎన్‌బీఏ గుర్తింపు కోసం ప్రత్యేక ప్రణాళిక తయారు చేశాం. రాష్ట్రంలోని 87 ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాళ్లు, సిబ్బందికి దీనిపై పూర్తి అవగాహన కల్పించి.. దీని వల్ల మన ప్రతిష్ట ఎలా పెరుగుతుందో వివరించాం. ఇందుకోసం ఎన్‌బీఏ కో-ఆర్డినేషన్ బృందాలను ఏర్పాటు చేశాం. నిరంతరం పర్యవేక్షిస్తూ ఇందుకు అవసరమైన వనరులను సమకూర్చాం. ఏడాది పాటు శ్రమించాం. ఎన్‌బీఏ అధికారుల బృందం అన్ని రకాల పారామీటర్స్ నిశితంగా పరిశీలించి సంతృప్తి చెందితేనే గుర్తింపునకు సిఫార్సు చేస్తుంది. కాలేజీల్లోని మౌలిక సదుపాయాలు, బోధనాభ్యసన విధానాల్లో సృజనాత్మకత, బోధనా ప్రమాణాలు, విద్యా ప్రమాణాలు, ఫలితాలు, ల్యాబ్, టెక్నాలజీ, లైబ్రరీ వినియోగం వంటి అంశాలను పరిశీలిస్తుంది. అందరి కృషి ఫలితంగా మన రాష్ట్రంలో 40 ప్రభుత్వ కాలేజీలకు ఎన్‌బీఏ గుర్తింపు లభించి దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచాం. మహారాష్ట్రలో 30 కాలేజీలకు గుర్తింపు రావడంతో రెండవ స్థానంలో, తెలంగాణలో 26 కాలేజీలకు ఎన్‌బీఏ గుర్తింపుతో మూడవ స్థానంలో ఉన్నాయి. మన రాష్ట్రంలో మిగతా కాలేజీలకు ఎన్‌బీఏ గుర్తింపు కోసం కృషి జరుగుతోంది. ఎన్‌బీఏ గుర్తింపు వల్ల కొత్త కోర్సులు ప్రారంభించడంతో పాటు విద్యార్థులకు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో ఉద్యోగావకాశాలు పెరుగుతాయి. ఇక్కడి విద్యార్థులు గ్లోబల్ స్టూడెంట్స్‌గా ఎదుగుతారు.

ఉద్యోగాలిచ్చే వారికి రెడ్/గ్రీన్ కార్పెట్‌లు

మన విద్యార్థులకు ఉద్యోగాలు ఇవ్వడానికి ముందుకు వచ్చే కంపెనీల ప్రతినిధులకు రెడ్/గ్రీన్ కార్పెట్‌లతో ఆహ్వానిస్తున్నాం. పాలిటెక్నిక్ కళాశాలల టీపీవోలు ప్రత్యేక ఎంవోయూలు కుదుర్చుకుంటున్నారు. దీని వల్ల ప్రతి కాలేజీలోనూ కనీసం 70 శాతం మందికి ఉద్యోగాలు పొందుతున్నారు. మల్టీ నేషనల్ కంపెనీలు మన విద్యార్థులకు మంచి ఆఫర్‌లు ఇస్తున్నాయి. అత్యధికంగా రూ.8.25 లక్షల నుంచి రూ.5 లక్షలు, 4 లక్షలకు పైగా వార్షిక ప్యాకేజీలతో ఉద్యోగాలు వస్తున్నాయి. ఒక విద్యా సంవత్సరంలో కాలేజీ విద్యార్థుల సంఖ్యను బట్టి వంద నుంచి 300 మంది వరకు ఉద్యోగాలు సాధించడమంటే మాటలు కాదు. ఇది అందరి సమన్వయంతో కృషి చేయడం వలనే సాధ్యమైంది. ఈ పరంపర రానున్న కాలంలో కొనసాగించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేశాం.

12,000 మందికి ఉద్యోగాలు

మన రాష్ట్రంలో ఈ ఏడాది (2023–24)లో 12,000 మంది పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చాయి. ప్రత్యేక డ్రైవ్‌ల నిర్వహణ ద్వారా ఇది సాధించాం. మునుపెన్నడూ లేని విధంగా క్యాంపస్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాం. ఇందుకోసం సెంట్రలైజ్ పర్యవేక్షణ చేస్తూ అన్ని కాలేజీలకు చెందిన ప్రిన్సిపాళ్లు, టీపీవోలు, కంపెనీ ప్రతినిధులు ఒకే వేదికపై చర్చించి.. కంపెనీల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తయారు చేయడానికి సూచనలిస్తున్నాం. రాష్ట్రస్థాయిలో ఇందుకోసం డిప్యూటీ డైరెక్టర్ స్థాయిలో ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్‌గా డాక్టర్ ఎంఏవీ రామకృష్ణ పనిచేస్తున్నారు. కనీసం వారానికోసారి దీనిపై సమీక్ష నిర్వహించడం వల్ల మంచి సత్ఫలితాలు వచ్చాయి. పాడేరు, చీపురుపల్లి, శ్రీశైలం, మడకశిర, ధర్మవరం, రాయచోటి వంటి మారుమూల ప్రాంతాల్లోని పాలిటెక్నిక్ విద్యార్థులు మంచి ఉద్యోగాలు సాధించారు. సెంట్రల్, క్లస్టర్ డ్రైవ్‌లు, కాలేజీల వారీగా క్యాంపస్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాం. ఇది మంచి ఫలితాలినిచ్చింది. మేనేజ్‌మెంట్‌తో సంబంధం లేకుండా ప్రైవేటు కాలేజీల్లో కూడా ప్లేస్‌మెంట్‌ల కోసం ప్రత్యేక క్యాంపస్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాం. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి కోసం శిక్షణనిస్తున్నాం సిలబస్‌లో మార్పులు తెచ్చాం. మన విద్యార్థులను టెక్నాలజీ 4.0 దిశగా తయారు చేస్తున్నాం.

బ్లేడ్‌తో దాడి.. ఒకరికి గాయాలు



రక్తస్రావంతో బాధితుడు రాంబాబు

రాంబిల్లి : జంగాలపాలెం వద్ద సోమవారం బ్లేడ్‌తో దాడి చేయడంతో సెజ్ కాలనీ దిబ్బపాలేనికి చెందిన ఆర్.రాంబాబు తీవ్రంగా గాయపడ్డాడు. సీఐ లక్ష్మణరావు తెలిపిన వివరాలు. స్థానిక దుకాణం వద్ద శ్రీను ఒక అమ్మాయితో మాట్లాడుతుండగా, తనతో ఎందుకు మాట్లాడుతున్నావంటూ రాంబాబు ప్రశ్నించాడు. తనను అడిగేందుకు నువ్వెడవిరా అంటూ శ్రీను బ్లేడ్‌తో రాంబాబుపై దాడి చేసినట్లు సీఐ వెల్లడించారు. ఈ దాడిలో రాంబాబుకు ముఖం, మెడ భాగాల్లో తీవ్ర గాయాలై, విపరీతంగా రక్తస్రావం జరిగింది. రాంబాబును అచ్యుతాపురం ఆస్పత్రికి తరలించి, హత్యా నేరం కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. బ్లేడ్ దాడితో స్థానికంగా కలకలం రేగింది.

డివైడర్ పైకి దూసుకెళ్లిన బస్సు



డివైడర్‌పై నిలిచిన బస్సు

మాకవరపాలెం: డివైడర్ పైకి బస్సు దూసుకుపోయిన సంఘటనలో భారీ ప్రమాదం తప్పింది. అనకాపల్లి నుంచి నర్సీపట్నం వైపు వస్తున్న ప్రైవేట్ బస్సు ఆదివారం అర్ధరాత్రి మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఒక్కసారిగా అదుపు తప్పి డివైడర్ పైకి దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో సుమారు 40 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ సంఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు అవలేదు.

రోడ్డు ప్రమాదంలో అక్కాతమ్ముళ్లకు గాయాలు

కశింకోట : మండలంలోని జమాదులపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కాతమ్ముళ్లు తీవ్రంగా గాయపడ్డారు. సీఐ ఎం. వినోద్‌బాబు అందించిన వివరాల ప్రకారం..బయ్యవరం వంతెన వద్ద అనకాపల్లి నుంచి జమాదులపాలెం గ్రామం వెళుతున్న బైక్‌ను పరవాడపాలెం నుంచి అనకాపల్లి వైపు వస్తున్న మరో బైక్ ఒకే రోడ్డులో ఎదురుగా ఢీకొన్నాయి. దీంతో ఒక బైక్ నడుపుతున్న జమాదులపాలెం గ్రామానికి చెందిన గెంజి శివగణేష్, వెనుక కూర్చున్న అక్క అల్లం లక్ష్మి రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డారు. వీరిని అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మళ్లీ పెన్షన్ టెన్షన్



- తలలు పట్టుకుంటున్న అవ్వాతాతలు
- తలుపు తట్టి పింఛనిచ్చిన వలంటీర్లు దూరం
- నియోజకవర్గంలో 33,910 మంది పింఛనుదారులు
- 25 వేల మంది వృద్ధులకు బ్యాంకుల్లోనే నగదు జమ

అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగుల ముఖాల్లో చిరునవ్వు చిన్నబోతోంది. ఒకటో తారీఖు వస్తోందంటే.. పింఛన్ అందుకుంటామన్న ఆనందం కంటే.. బ్యాంకులు, సచివాలయాల వద్ద పడే వ్యయ ప్రయాసలు గుర్తుకొచ్చి గుబులు రేగుతోంది. రెండు నెలలుగా పింఛన్ కోసం వారు అనుభవించిన అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ఇప్పుడు మరో నెల వస్తోంది. తిప్పలు మాత్రం తప్పేలా లేకపోవడంతో, ఈ ఎండల్లో ఎలారా భగవంతుడా..? అంటూ వాపోతున్నారు.

తుమ్మపాల: గత ప్రభుత్వంలో పింఛన్ కోసం అధికారుల ముందు చేతులు కట్టుకుని, వారు ఎప్పుడిస్తే అప్పుడే మహద్భాగ్యం అనుకునే పరిస్థితి. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల జీవితాల్లో సామాజిక గౌరవాన్ని పెంచాలన్న సీఎం జగన్ ఆకాంక్ష వలంటీర్ల ద్వారా ఇంటి వద్దే పింఛన్ల పంపిణీతో నెరవేరింది. లబ్ధిదారుల గౌరవానికి భంగం లేకుండా, వారి జీవితాలకో భరోసా ఇచ్చింది. అనారోగ్యంతో ఆస్పత్రుల్లో ఉన్నా, తప్పనిసరి పరిస్థితుల్లో వేరే ఊరికి వెళ్లినా.. వలంటీర్లు వారిని వెతుక్కుంటూ వెళ్లి ప్రతి నెలా ఒకటో తేదీనే వారి యోగక్షేమాలు తెలుసుకుని మరీ, పింఛన్ అందించేవారు. టీడీపీ, దాని మిత్రపక్షాల కుట్రలు, ఎన్నికల సంఘం ఆదేశాలతో గత రెండు నెలలు పింఛన్ అందుకోవడానికి లబ్ధిదారులు పడ్డ తిప్పలు వర్ణనాతీతం. ఇప్పుడు జూన్ నెల పింఛన్ కోసం కూడా అవే తిప్పలు తప్పని పరిస్థితి.

25 వేల మందికి బ్యాంకుల్లోనే నగదు జమ

అనకాపల్లి నియోజకవర్గంలో ప్రస్తుతం 33,910 మంది పింఛనుదారులున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు దాదాపు రూ.571 కోట్ల నగదు లబ్ధిని వలంటీర్ల ద్వారా ఇంటి వద్దే అందించింది. ప్రతి నెల సుమారు రూ.10 కోట్ల మేర పంపిణీ జరుగుతోంది. తాజాగా పెంచిన రూ.3 వేల పింఛన్‌తో ప్రధాన కేటగిరీలైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలతోపాటు ఇతర పింఛన్ లబ్ధిదారుల ఇళ్లకు వలంటీర్లే వెళ్లి పింఛన్ నగదు అందించేవారు. ఎన్నికల నేపథ్యంలో విపక్షాల ఫిర్యాదుపై ఈసీ ఆదేశాల మేరకు వీరిలో 25,606 మందికి బ్యాంకుల్లోను, 8,304 మందికి సచివాలయ సిబ్బంది నేరుగా వారిళ్లకు వెళ్లి పింఛన్ లబ్ధి అందిస్తున్నారు. ఈ క్రమంలో బ్యాంకుల్లో నగదు తీసుకోవడం అవ్వాతాతలకు తలకు మించిన భారంగా మారింది.

భయపెడుతున్న పాత రోజులు

టీడీపీ ప్రభుత్వ హయాంలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ఫించన్లు తీసుకోవాలంటే తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రతి నెల ఒకటో తేదీ దాటినా.. పింఛన్ ఎప్పుడు ఇస్తారో తెలియక ప్రభుత్వ కార్యాలయాల వద్ద పడిగాపులు కాచేవారు. బారులు తీరి గంటల కొద్ది క్యూలో నిల్చున్న రోజులను నేటికీ మరచిపోలేదు. వేసవి కాలంలో క్యూలైన్లలో నిల్చోలేక సొమ్మసిల్లిన లబ్ధిదారుల సంఖ్య లెక్కపెట్టలేనంత. ఆ జ్ఞాపకాలు వృద్ధుల్ని వెంటాడుతూనే ఉన్నాయి. వ్యవస్థలను మేనేజ్ చేసే చంద్రబాబు తమకు పాత రోజులు గుర్తు చేస్తున్నారంటూ వాపోతున్నారు. ఎంత వేగంగా ఈ కష్టాలు తీరతాయా? అని నిరీక్షిస్తున్నారు.

ప్రధాన పింఛన్లు, లబ్ధి		
కేటగిరీ	లబ్ధిదారులు	నగదు లబ్ధి
వృద్ధులు	17,211	రూ.5.16 కోట్లు
వితంతువులు	9,926	రూ.2.97 కోట్లు
దివ్యాంగులు	4,139	రూ.1.24 కోట్లు
ఒంటరి మహిళలు	810	రూ.24.30 లక్షలు

మండలాల వారీగా పింఛన్ వివరాలు			
మండలం	డీబీటీ	డోర్ టు డోర్	నగదు లబ్ధి రూ. కోట్లలో
అనకాపల్లి	9,685	3,463	3.86
కశింకోట	8,179	2,422	3.10
అనకాపల్లి టౌన్	7,742	2,419	3.03
మొత్తం	25,606	8,304	9.99

మళ్లీ అవే తిప్పలు



ఒకటో తేదీ వస్తోందని ఆనందపడాలో, పింఛన్ కోసం పడే తిప్పలు తలచుకుని బాధపడాలో అర్థం కావట్లేదు. పింఛను తీసుకోవాలంటే బ్యాంక్‌కు వెళ్లాలి. ఇంటి నుంచి పట్టణంలో ఉన్న బ్యాంక్‌కు వెళ్లగలిగే పరిస్థితిలో లేను. నా వయస్సు 80 ఏళ్లు. ఇంటి నుంచి బయటకే రాలేను. అలాంటిది బ్యాంక్‌కి నన్నెవరు తీసుకెళ్తారు. వలంటీర్ల ద్వారా పింఛను పంపిణీ చేయకుండా అడ్డుకోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నా. గత నెలలో పడిన బాధలు మళ్లీ గుర్తుకొస్తున్నాయి. ఇంకెన్ని రోజులు మాకీ బాధలు.

–మంతిన సీతామహాలక్ష్మి, తారకరామ కాలనీ

నేడు పెద పైడిమాంబ పెద్ద పండగ

- జిల్లా నలుమూలల నుంచి తరలిరానున్న భక్తులు



పెద పైడిమాంబ అమ్మవారి ఆలయం



పెద పైడిమాంబ అమ్మవారు

కె.కోటపాడు: చౌడువాడ గ్రామ దేవత పెద పైడిమాంబ అమ్మవారి పెద్ద పండగను మంగళవారం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అమ్మవారి పండగను ఐదేళ్లకోసారి నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా ఆది, సోమవారాల్లో ఇక్కడ ఆలయ ప్రాంగణంలో భారీ ప్రభ ప్రదర్శించారు. ఊరికట్టు కార్యక్రమాన్ని సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ఇతర ప్రాంతాలకు ఉద్యోగ, ఉపాధి నిమిత్తం వెళ్లిన వారు అమ్మవారి పెద్ద పండగ సందర్భంగా తిరిగి గ్రామానికి చేరుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది. జిల్లాతోపాటు ఇతర జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రానున్నారు. మరోవైపు గ్రామాన్ని, గుడిని విద్యుద్దీపాలంకరణతో ముస్తాబు చేశారు. అమ్మవారి ఆలయంలో దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా గ్రామ పెద్దలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు కె.కోటపాడు ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.



గ్రామంలో విద్యుద్దీపాలంకరణ

అనధికార పార్కింగ్‌తో అవస్థలు



రోడ్డుపై నిలిపిన బొగ్గు లారీలు

పరవాడ: మండలంలోని పరవాడ మండల కాంప్లెక్సు, సినిమాహాలు కూడలి, ఊటగెడ్డ కూడలి తదితర ప్రాంతాల్లో అనధికార పార్కింగ్‌తో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. విశాఖ, తదితర ప్రాంతాల నుంచి పరిశ్రమలకు బొగ్గు సరఫరా చేసే బొగ్గు లారీలు లంకెలపాలెం మీదుగా రాత్రి పగలు తేడా లేకుండా ప్రయాణిస్తున్నాయి. వాహనాలను రోడ్ల పక్కన నిలిపి టీ, టిఫెన్, భోజనాల కోసం హోటళ్లకు వెళ్లి గంటల తరబడి కాలయాపన చేయడంతో ప్రయాణికులు వాహనాలను తప్పించుకొని రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో రోడ్ల పక్కన నిలిపిన వాహనాలను గుర్తించలేక తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. దారి పొడవునా నిలుపుతున్న బొగ్గు వాహనాల కారణంగా వేరే భారీ వాహనం ప్రయాణించడం కష్టమవుతుంది. రోడ్ల పక్కన యథేచ్ఛగా నిలుపుతున్న వాహన యజమానులపై పోలీసులు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించిన మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: వాతావరణంలో మార్పుల కారణంగా వృద్ధులు, పిల్లలు జాగ్రత్త వహించాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. స్థానిక 82వ వార్డు పరిధి ఉమ్మలాడ జంక్షన్ వద్ద మాజీ కౌన్సిలర్ దాడి భోగలింగేశ్వరరావు ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ చలివేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉష్ణోగ్రతలు తక్కువగా ఉన్నప్పటికీ ఉక్కబోత ఎక్కువగా ఉంటోందని, ఇలాంటి సమయంలో పాదచారులకు, వాహనదారులకు మజ్జిగ చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పట్టణ కార్యదర్శి గైపూర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు త్రిపురాంతక స్వామికి పుష్పాంజలి

కశింకోట: స్థానిక శివాలయంలో కొలువైన సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి వారికి పుష్పాంజలి ఉత్సవం మంగళవారం రాత్రి 7 గంటలకు జరపనున్నట్లు అర్చకులు వి.బాబ్జి, వి.కృష్ణ సోమవారం తెలిపారు. ఈ నెల 23న నిర్వహించిన స్వామి వారి కల్యాణోత్సవంలో భాగంగా పుష్పాంజలి జరగనుందన్నారు. ఈ సందర్భంగా స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను నూతన వస్త్రాలు, పూలమాలలతో అలంకరించి మిఠాయిలు, పండ్లు తదితర పదార్థాలతో ప్రత్యేక పూజలు జరుపుతామన్నారు. భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.

వాహనం ఢీకొని వ్యక్తికి గాయం



గుర్తు తెలియని వాహనం ఢీకొని కాలికి తీవ్రగాయమైన జ్యోతికిరణ్

అనకాపల్లి: స్థానిక సుంకర మెట్ట జంక్షన్ వద్ద అదే ప్రాంతానికి చెందిన జ్యోతికిరణ్ గుర్తు తెలియని వాహనం ఢీకొని గాయపడ్డాడు. కాలికి తీవ్ర గాయమయింది. స్థానికుల సహాయంతో హుటాహుటిన స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులను వివరణ కోరగా ఎటువంటి ఫిర్యాదు రాలేదన్నారు.

అనకాపల్లి సినిమాలు

దర్టీ ఫెలో	: రాజా
ఫ్యూరియోసా	: సత్యనారాయణ స్క్రీన్‌-1
వ్యాన్	: సత్యనారాయణస్క్రీన్‌-2
బాక్	: షిర్డిసాయి
ఆ ఒక్కటీ అడక్కు	: పర్తిసాయి
రాజుయాదవ్	: వెంకటేశ్వర
మంజుమ్మల్ బోయ్స్	: శ్రీసత్య
కృష్ణమ్మ	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 893 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	5,000	5,070
మొదటి రకం	4,500	4,830
రెండో రకం	3,950	4,510
మూడోరకం	3,500	4,140

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 56 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్‌-7 యూనిట్లు, బీ పాజిటివ్‌-30 యూనిట్లు, బీ నెగిటివ్‌-2 యూనిట్లు, ఓ పాజిటివ్‌-12 యూనిట్లు, ఓ నెగిటివ్‌-1 యూనిట్, ఏబీ పాజిటివ్‌-3 యూనిట్లు, ఏబీ నెగిటివ్‌-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్(9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 369 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 325 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

ఉపాధి కూలీలకు వేతనాలు పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

పరవాడ: ఉపాధి హామీ కూలీల వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. తానాం గ్రామంలో చెరువు పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలనుద్దేశించి ఆయన మాట్లాడారు. ఉపాధి కూలీలకు కనీస వేతనం రూ.600 చెల్లించాలన్నారు. తాగునీరు తీసుకువచ్చే మనిషికి దూరాన్ని బట్టి కూలి చెల్లించాలన్నారు. వేసవిలో 30 శాతం అలవెన్సును చెల్లించి ఆదుకోవాలని కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, పార్వతి, రమణమ్మ, అప్పారావు పాల్గొన్నారు.

గాయపడ్డ లారీ డ్రైవర్‌కు ఆర్థిక సాయం



వానపల్లి శ్రీనుకు ఆర్థిక సాయం అందిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు

అనకాపల్లి: జీవీఎంసీ విలీనగ్రామం కేఎస్‌ఆర్ పేటకు చెందిన లారీ డ్రైవర్ వానపల్లి శ్రీనుకు కొప్పాక హెల్పింగ్ హ్యాండ్స్, ప్రీమియర్‌లీగ్ మేనేజ్‌మెంట్ ప్లేయర్స్ సోమవారం ఆర్థిక సాయం అందించారు. శ్రీను ఈ నెల 18న ఒడిశా రాష్ట్రం కటక్ హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఎడమ కాలు విరిగిపోయింది. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆపరేషన్ చేశారు. ఇందుకు రూ.5 లక్షలు ఖర్చయింది. దీంతో తమ వంతు సాయంగా రూ.54,831లు శ్రీనుకు ఆయన నివాసంలో అందించినట్లు హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధి గోపి తెలిపారు.

గ్రంథాలయాలు మనోవికాసానికి దోహదం



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఉపాధ్యాయులు



మ్యూజికల్ చైర్ ఆడుతున్న చిన్నారులు

యలమంచిలి : గ్రంథాలయాలు విద్యార్థుల మనోవికాసానికి ఎంతో దోహదపడతాయని సీనియర్ ఉపాధ్యాయులు రత్నరాజుఅన్నారు. యలమంచిలి శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ తరగతులను ఆయన ఫిజికల్ డైరెక్టర్ దుర్గారావుతో కలసి సోమవారం విద్యార్థులకు పుస్తక పఠనం, ఇంగ్లిష్ గ్రామర్, నీతి కథలు బోధించారు. అనంతరం విద్యార్థులకు మ్యూజికల్ చైర్ వంటి ఆటలను ఆడించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నిర్వహిస్తున్న ఈ వేసవి శిక్షణ శిబిరం వారిలో విజ్ఞానాన్ని పెంపొందించడానికి ఎంతో తోడ్పడుతుందన్నారు. విద్యార్థుల్లో మానసిక ఉల్లాసానికి, వారిలో ఒత్తిడిని పారదోలడానికి ఇండోర్ గేమ్స్ వంటి ఆటలు ఉపయోగపడతాయని అన్నారు. విద్యార్థులందరూ వారికి ఇష్టమైన విభాగాల్లో శిక్షణ పొంది నైపుణ్యం పెంచుకోవాలని, అలాగే గ్రంథాలయాన్ని ఉపయోగించుకని ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వి.ఆనంద్ పాల్గొన్నారు.

హ్యాక్‌థాన్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులు తయారు చేసిన వ్యవసాయ రోబోటిక్స్



సాధించిన ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

సబ్బవరం: ఆంధ్రా విశ్వవిద్యాలయంలోని ఇంక్యుబేషన్ సెంటర్‌లో ఈ నెల 26న రాష్ట్రస్థాయిలో నిర్వహించిన హ్యాక్‌థాన్ పోటీల్లో సబ్బవరం ప్రతిభా విద్యాలయం విద్యార్థులు తమ సత్తా చాటారు. అటల్ టింకరింగ్ ఇన్నోవేషన్ ప్రదర్శనలో భాగంగా రోబోటిక్స్ విభాగంలో కె. అభిషేక్ బృందం ఆవిష్కరించిన అగ్రి రోబోటిక్స్ అత్యుత్తమ ప్రదర్శనల్లో నిలిచిన 5 టీమ్‌లలో మూడో స్థానంలో నిలిచిందని పాఠశాల కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ తెలిపారు. అటల్ టింకరింగ్ ల్యాబ్ ఇన్‌చార్జ్,పాఠశాల సైన్స్ టీచర్ బోకం తులసీ ప్రియాంక నేతృత్వంలోని కాపల అభిషేక్(పదోతరగతి),లగుడు మోహన్ వంశీ(9వ తరగతి),బొడ్డేటి కావ్యప్రియ(8వ తరగతి),జి జ్ఞాన సాత్విక్(7వ తరగతి) బృందం ఆవిష్కరించిన అగ్రి రోబోటిక్ నమూనాకు గుర్తింపు లభించిందన్నారు. వ్యవసాయ రంగంలో పంట నమూనాల సేకరణ నుంచి ఆయా పంటల నాట్లు, పంట చేతికి వచ్చే వరకూ అన్ని రకాల పనులు ఈ రోబోటిక్స్ చేసేవిధంగా నమూనాను ఆవిష్కరించారన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను సోమవారం ఆయన అభినందించారు.

వీరేశలింగానికి ఘన నివాళి



కందుకూరి వీరేశలింగం చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సీఐటీయూ, ఐద్వా నాయకులు

కశింకోట: ప్రముఖ సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం కశింకోటలో నిర్వహించారు. సీఐటీయూ, ఐద్వా, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వీరేశలింగం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సాంఘిక దురాచారాలను రూపు మాపడానికి ఆయన చేసిన కృషిని ప్రస్తుతించారు. కార్యక్రమంలో సీఐటీయు జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా నాయకురాలు డి.డి.వరలక్ష్మి, వివిధ సంఘాల ప్రతినిధులు ఆర్.అమ్మాజీ, సత్యవతి, బి.మాలెమ్మ, పూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మరాజుపేటలో ఉపాధి హామీ పనులు



తిమ్మరాజుపేటలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేటలో సోమవారం గ్రామీణ ఉపాధి హామీ పనులు ప్రారంభం అయ్యాయి. ఇటీవల తిమ్మరాజుపేట సచివాలయం వద్ద ఉపాధి హామీ పనులు చేపట్టాలని నిర్వహించిన ధర్నా ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. దీంతో ఎంపీడీవో సురేశ్‌కుమార్ ఆదేశాల మేరకు వీఆర్పీ రామలక్ష్మి పర్యవేక్షణలో పనులు ప్రారంభించారు. ఏపీవో టి.వసంతకుమార్, టి.ఐ వెంకటరావుతో పాటు స్థానిక ప్రతినిధులు శరగడం శివ బాపునాయుడు, కర్రి అప్పారావు, జగ్గారావు, ఆర్.రాము పాల్గొన్నారు.

సన్యాసమ్మ తల్లి ఒడ్డు పండగ 18కు వాయిదా



సమావేశమైన ఆలయ ధర్మకర్త లలితానాయుడు

దేవరాపల్లి: స్థానిక గ్రామ దేవత సన్యాసమ్మ తల్లి ఒడ్డు పండుగను వచ్చే నెల 18న అంగరంగ వైభవంగా నిర్వహించాలని గ్రామ పెద్దలంతా నిర్ణయించారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం జూన్ 4న పండగ జరగాల్సి ఉంది. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతోపాటు అదే రోజు ఓట్ల లెక్కింపు జరగనుండటంతో పండగ వాయిదా వేసుకోవాలని ఆలయ ధర్మకర్త వరదపురెడ్డి లలితానాయుడుకు ఎస్‌ఐ డి. నాగేంద్ర సూచించారు. ఆ మేరకు స్థానిక రామాలయంలో గ్రామ పెద్దలతో సోమవారం సమావేశం నిర్వహించారు. గ్రామ పెద్దల అభిప్రాయం మేరకు వచ్చే నెల 18న అమ్మవారి ఒడ్డు పండుగ నిర్వహించాలని నిర్ణయించారు. ఆ రోజున పసుపు కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకోవాలని ఆలయ ధర్మకర్త విజ్ఞప్తి చేశారు. సమావేశంలో డాక్టరు వరదపురెడ్డి సింహాచలంనాయుడు, మహేశ్వరీ నాయుడు, కె.వి.రమణ, జాగరపు అబద్దం, చొక్కాకుల రమణ తదితర గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

కిశోర బాలికల ఆరోగ్యంపై అవగాహన



కోటవురట్లలో కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ కనకదుర్గ

కోటవురట్ల: కిశోర బాలికలు బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా రక్తహీనత నుంచి తప్పించుకోవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కనకదుర్గ సూచించారు. స్థానిక సంతబయలు వద్ద ఉన్న అంగన్వాడీ కేంద్రంలో సోమవారం కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలు రుతుక్రమంలో తగు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు మంచి ఆహారాన్ని తీసుకోవాలన్నారు. శరీరంలో వచ్చే మార్పులను గమనిస్తూ అపోహలు పడకుండా అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాలను అడ్డుకోవాలని, చదువు పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు.

క్షయ నివారణపై ప్రత్యేక దృష్టి



వైద్యాధికారితో మాట్లాడుతున్న అయ్యప్పరెడ్డి

మాడుగుల రూరల్: క్షయ వ్యాధి నివారణపై ప్రత్యేక దృష్టి సారించామని జిల్లా క్షయ వ్యాధి నివారణ సమన్వయకర్త కె. అయ్యప్పరెడ్డి అన్నారు. సోమవారం ఆయన కె.జె.పురం పీహెచ్‌సీలో ల్యాబ్‌ను పరిశీలించారు. ఇక్కడ కేసులు వివరాలు గురించి వైద్యాధికారులు ప్రసాదుపాత్రుడు, లీలాప్రసాదులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అయ్యప్పరెడ్డి మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్తులకు పీహెచ్‌సీలో మందులు అందిస్తామన్నారు. వీరికి ప్రభుత్వం రూ.500 పింఛను అందిస్తుందన్నారు. పీహెచ్‌సీలో ఉచిత క్ష నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి సీహెచ్ పుష్పమ్మ, ల్యాబ్ టెక్నీషియన్లు నాయుడు, కోటి, సిబ్బంది ఈశ్వరరావు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి ఉత్సవాలకు బ్రాండిక్స్ విరాళం



చెక్కును అందజేస్తున్న దొరైస్వామి

అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట అభయాంజనేయ స్వామి నవరాత్రి మహోత్సవాలకు బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి యాభై వేల రూపాయలను విరాళం అందించారు. ఈ సందర్భంగా ఉత్సవాలను తిలకించారు. శరగడం బాపునాయుడు, శరగడం నాగర్జున, ఆడారి నర్సింగరావు, రవికుమార్, రాము పాల్గొన్నారు.